

# ప్లీజ్ ఒక్కసారి చూడు డాడీ

## రాజేష్ ఖన్నా మృతితో మిన్నంటిన రోదనలు



వారికి దారి చూపిన కాళ్లు చితిమండల్లో కాలే కట్టెల పాలయ్యాయి.. ఎందరో నిస్సహాయుల భుజము తట్టిన ఆ చేతులు బూడిద పాలయ్యాయి.. ఎంతో ఎత్తుకు ఎదగాలనీ, ఇద్దరు బిడ్డలకు బంగారు భవిష్యత్తు ప్రసాదించాలని వేల కలలు గన్న ఆ కండ్లు చితి మంటల్లో కాలి కమిలిపోయాయి... నిత్యం వారిని మేలు కొలిపే ఆయన గంభీరమైన స్వరం గాఢ నిదురపోయింది.. మొత్తం మీద వారి ఇంటి దీపం ఆరిపోయింది.. నిజమోకాదో తెలియదు కానీ విధి పగబట్టినట్టయింది..కేవలం మూడేండ్ల కాలంలోనే నలుగురు కుటుంబ పెద్దలను కోల్పోయి నేడు ఆ కుటుంబం తీరని శోఖ సంద్రంలో మునిగిపోయింది. అదే వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ అన్నెబోయిన రాజేష్ ఖన్నా కుటుంబం ఎదుర్కొన్న తీరని విషాధ గాథ.

వరంగల్ బ్యూరో, కెరటం న్యూస్

- ఖన్నా మృతితో ఆరిపోయిన ఆ ఇంటి దీపం..
- డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ ఖన్నాకు పలువురి కన్నీటి నివాళులు
- మూడేండ్లలోనే నలుగురిని కోల్పోయిన ఆ కుటుంబం
- రాజేష్ ఖన్నా పాడెమోసిన టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర నేత రమేష్ పాక
- రాజేష్ ఖన్నా అంత్యక్రియల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

ఇటీవలే తీవ్రమైన అనారోగ్యంతో ఓ హాస్పిటల్‌లో చేరి చాలా ఖర్చుచేసి ఆరోగ్యం కుదుట పడిరదని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక సహకారంతో రూ.7లక్షల బిల్లు మాఫీ చేయించి సంతోషంగా ఇంటికి చేరిన ఐదు రోజుల్లోనే తీవ్రమైన గుండెపోటుతో డిటీ రాజేష్ ఖన్నా మృతిచెందారు. కేవలం మూడేండ్ల కాలంలోనే ఒకే కుటుంబానికి చెందిన రాజేష్ ఖన్నాతో సహా నలుగురు ఇంటి పెద్దలు మృత్యువాత పడటం ఆ కుటుంబాన్ని తీరని వేదనకు గురిచేసింది. ప్రస్తుతం రాజేష్ మరణంతో ఆయన సతీమణి రమాదేవి తోపాటు ఆయన తల్లి, రాజేష్ ఇద్దరు కూతుళ్లు కలిపి నలుగురు మహిళలే కావడంతో ఆ ఇంట్లో మగదిక్కు లేక మౌనంగా గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

**మాయదారి కిడ్నీ జబ్బుతో విధి పగబట్టింది..**

వరంగల్ జిల్లా నల్లబెల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేష్ ఖన్నా కుటుంబం మొదటి నుండే అనేక కష్టాలు, కడగండ్లు ఎదుర్కొంటూ వస్తోంది. తొలుత రాజేష్ తల్లిదండ్రులు అన్నెబోయిన సారయ్య, సర్వాదేవికి





ఐదుగురు(శ్రీదేవి, పద్మ, విజయ, రాజేష్‌ఖన్నా, వినోద్‌కుమార్) సంతానం. ఇందులో శ్రీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. సమాజంలో మంచి గౌరవం ఉన్న కుటంబంగా పేరున్న రాజేష్ కుటుంబంలో తొలుత ఆయన సోదరి విజయకు కిడ్నీ సమస్య రావడంతో వివిధ హాస్పిటళ్లలో చూపించారు. చాలా వరకూ ఖర్చు చేశారు. కానీ మాయదారి కిడ్నీ జబ్బు ఎన్ని మందులు వాడినా తగ్గలేదు సరికదా మరింతగా విజృంభించడంతో 2022లో విజయ కన్నుమూసింది. ఈ విషాధం నుండి తేరుకునే లోగానే 2023లో అనారోగ్యంతో రాజేష్ తండ్రి సారయ్య మృతి చెందాడు. దీంతో మరింత కన్నీటి శోకంలో నిండిన కుటుంబంలో 2025 మార్చి నెలలో రాజేష్ సోదరుడు వినోద్ కుమార్ ఆకస్మిక మరణం పాలయ్యాడు. ఇలా కుటుంబం కంటనీరు ఆరక ముందే తాజాగా వీళ్లందరికీ ఒకే ఒక్క పెద్ద దిక్కుగా ఉన్న రాజేష్ కూడా యాభై ఏండ్ల వయసులోనే కిడ్నీ వ్యాధితో తనువు చాలించడంతో ఇక ఆ కుటుంబ ఆవేదన మాటల్లో వర్ణించలేకుండా పోయింది. కేవలం మూడేండ్లలోనే నలుగురు మృత్యువాత పడటం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

ప్లీజ్ ఒక సారి చూడు డాడీ...

**రాజేష్‌ను వెంటాడిన మృత్యువు..**

నల్లబెల్లి డీటీగా పనిచేస్తున్న రాజేష్ కుటుంబ పరిస్థితులు ఒక సారి పరిశీలిస్తే... చిన్న నాటి నుండే కష్టాలను కండ్లారా చూస్తూ పెరిగాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబం కావడంతో అంతగా ఆస్తిపాస్తులు లేవు. తొలుత క్లర్కుగా ఉద్యోగంలో చేరిన రాజేష్ క్రమశిక్షణగా ఎదిగారు. నల్లబెల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ గత కొన్నేండ్ల కిందట కిడ్నీ సమస్య రావడంతో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. ఆయన సతీమణి రమాదేవి తన భర్తను బతికించుకునేందుకు గాను కొన్నేండ్ల కిందటే తన కిడ్నీ దానం చేశారు. అప్పటి నుండి కొద్ది కాలం బాగానే ఉన్నా తరచుగా రాజేష్ ఆరోగ్యం క్షీణించడం మళ్లీ బాగు కావడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ నెలలోనే కిడ్నీ సమస్య తలెత్తడంతో ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్య ఖర్చులకోసం రాజేష్ భార్య రమాదేవి ఉన్నదంతా ఊడ్చి ఖర్చుచేసింది. అయిన వారినల్లా అప్పులు అడిగి మరీ భర్తను బతికించుకునేందుకు పరుగులు పెట్టింది. అయినా కిడ్నీ జబ్బు మరింతగా పెరగడంతో లక్షల్లో ఖర్చయింది. రాజేష్ ఆరోగ్యం కుదుట పడిరదని ఆస్పత్రి వర్గాలు డిశ్చార్జీకి ఏర్పాట్లు చేసి ఏడు లక్షల బిల్లు చెల్లించాలని చెప్పడంతో రమాదేవి నిర్ఘాంతపోయింది. చేతిలో చిల్లి గవ్వలేక పోవడంతో చివరికి ఒక వీడియో రిలీజ్ చేసింది. తన భర్త వైద్యం కోసం చెల్లించేందుకు మెడలో ఉన్న తాళి తప్ప మరేదీ మిగల్లేదని తీరని వేదనతో తన బాధను చెప్పింది. ఇది విన్న తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తక్షణమే స్పందించి టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక ను రాజేష్ చికిత్స పొందుతున్న హాస్పిటల్‌కు పంపారు. వెంటనే రాజేష్ ఉన్న హాస్పిటల్ వద్దకు వెళ్లిన రమేష్ పాక తొలుత రాజేష్ కుటుంబ సభ్యుల ఆవేదన విని తక్షణమే రూ.50వేలు తను అందించడమే కాకుండా రెవెన్యూ ఉద్యోగులకు వాట్సాప్ మెసేజ్ చేయడంతో ఇంకొందరు స్పందించి మరో లక్ష తయారు చేశారు. అయినా ఏడు లక్షలు హాస్పిటల్ బిల్లు కావడంతో ఆ బిల్లు చెల్లిస్తేనే డిశ్చార్జీ చేస్తామని వైద్యులు చెప్పడంతో ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేరుగా తాను స్వయంగా రమేష్ పాకతో కలిసి హాస్పిటల్‌కు వెళ్లి అక్కడున్న హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో ఒప్పించారు. ఈ సందర్భంగా వైద్యులకు రాజేష్ కుటుంబ పరిస్థితిని వివరించి ఏడు లక్షల బిల్లులో ఒక్క రూపాయి లేకుండా మానవత్వంతో రాజేష్‌ను ఆరోగ్యంగా ఇంటికి చేర్చారు. అంతా కుదుట పడిరదని ఆందరూ సంతోషిస్తున్న వేళ సోమవారం తెల్లవారు జామున 2.40 గంటల సమయంలో రాజేష్ తీవ్రమైన గుండెపోటుతో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.





**ఆకాశం తాకిన రాజేష్ కూతుళ్ల రోధన**

'డాడీ ప్లీజ్ డాడీ ఒక సారి చూడు డాడీ..కండ్లు తెరువు డాడీ..వీళ్లంతా నీకోసం వచ్చారు..చూడండి డాడీ..మమ్మీని చూడు డాడీ ఎలా ఏడుస్తుందో... ఎందుకు డాడీ ఇలా చేశావ్..' అంటూ కంటికి రెప్పలా అల్లారు ముద్దుగా పెంచుకున్న రాజేష్ ఇద్దరు కూతుళ్లు హర్షిణి, అమృత చేసిన రోధన మిన్నంటింది. వారితో పాటు రాజేష్ సతీమణి, ఆయన తల్లి గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు రాజేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరినీ కంట తడిపెట్టించింది. రాజేష్‌కు కుమారులు లేకపోవడంతో పెద్ద కూతురు తలకొరివి పెట్టారు. ఇంటి నుండి స్మశాన వాటిక వరకూ వందల సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు, రాజేస్ బంధు మిత్రులు అంతిమయాత్రో పాల్గొన్నారు.

**పాడె మోసిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ నేత రమేష్ పాక**

సోమవారం ఆర్ధరాత్రి వేళ 2.42 గంటలకు రాజేష్ ఇక లేరన్న వార్త ఆయన కుమార్తె ద్వారా ఫోన్‌లో తెలుసుకున్న రమేష్ పాక వారిని ఓదార్చే ప్రయత్నం చేశారు. రాజేష్‌ను బతికించుకోవాలని ఎంతో ఆరాటపడిన ఆయన కుటుంబ సభ్యులకు తోడుగా నిలిచి వారికి అండగా ఉన్న టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర బాధ్యులు రమేష్ పాక ఇద్దరూ రాజేష్ మరణ వార్త విని హుటాహుటిన హైదరాబాద్ నుండి వరంగల్‌కు చేరుకున్నారు. వారితో పాటు రెవెన్యూ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని రాజేష్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నేత లచ్చిరెడ్డి, రమేష్ పాక, తదితరులు మాట్లాడుతూ రాజేష్ కుటుంబానికి తోడుగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని సౌకర్యాలు సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు.

